www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 23 అక్టోబర్ 2023
5
అన్నమయ్య

జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

ప్రజా శక్తి రాయచోటి

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ సందర్భంగా కలెక్టర్ గిరీష పిఎస్, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్ రెడ్డి, శాసనమండలి ఉపాధ్యక్షురాలు జఖియా ఖానం, ఎంపీ మిథున్ రెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డిడి పేర్కొన్నారు. జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. నవరాత్రులలో భాగంగా శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో పూజించి పదవరోజు దశమితో విజయానికి సంకేతంగా దసరా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకుంటారన్నారు. దసరా పండుగ జిల్లా ప్రజలందరికి ధనం, ధ్యానం, ధైర్యం, అభయం, విజయం, ఆరోగ్యం, విద్య, సంతానం, సౌభాగ్యం, ఆయుః రారోగ్యాలను కలుగజేయాలనీ అన్ని రంగాలలో జిల్లా సమగ్ర అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ సందర్భంగా మాజీ టిటిడి పాలకమండలి సభ్యులు సుగవాసిప్రసాద్ బాబు ఆదివారం ఒక ప్రకటలో పేర్కొన్నారు.

ముగిసిన విజిలెన్స్ దాడులు

- నాలుగు దుకాణాల్లో సోదాలు
- 400 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్న అధికారులు
- వెండి, నగదు సీజ్

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరులో ఐటి అధికారుల తనిఖీలు ఆదివారంతో ముగిశాయి. నాలుగు బంగారం దుకాణాల్లో బిల్లులు లేని సుమారు 400 కిలోల బంగారాన్ని అధికారులు సీజ్ చేశారు. బంగారంతోపాటు 350 కిలోల వెండి, రూ.2 కోట్ల నగదును ట్యాక్స్ లేనివిగా అధికారులు గుర్తించారు. విజయవాడ, తిరుపతికి చెందిన ఐటి అధికారులు నాలుగు రోజులుగా ప్రొద్దుటూరులోని బుశెట్టి జువెలర్స్, డైమండ్స్ దుకాణాలతోపాటు గురురాఘవేంద్ర, తల్లం దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. అనంతరం భారీ ఎత్తున్న బంగారం సీజ్ చేశారు. సీజ్ చేసిన బంగారాన్ని అట్టపెట్టెలు, సూట్ కేసుల్లో భద్రపరిచి వాహనాల్లో తిరుపతికి తరలించారు. ఇతర ప్రాంతాల నుంచి బిల్లులు లేకుండా భారీ ఎత్తున బంగారాన్ని దిగుమతి చేసుకున్నట్లు ఐదిశాఖాధికారులు గుర్తించారు. వీటితోపాటు వజ్రాలు కూడా ఉన్నట్లు సమాచారం. పన్నులు కట్టాల్సిన డబ్బులు సుమారు రూ.170 కోట్లు ఉన్నట్లు గుర్తించారు. సుమారు 40 మంది అధికారులు 14 కార్లల్లో వచ్చి సోదాలు చేశారు.

బంగారాన్ని తరలిస్తున్న అధికారులు

బంగారు వ్యాపారంలో ప్రొద్దుటూరు రెండో ముంబయిగా ఖ్యాతి గడించింది. దీంతో భారీగా అక్రమ బంగారం దిగుమతి అవుతోందన్న పక్కా సమాచారంతో అధికారులు నాలుగు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ప్రొద్దుటూరులో దాదాపు రెండు వేలకు పైగా బంగారం, స్వర్ణకారుల దుకాణాలున్నాయి. ఐటి అధికారుల తనిఖీలతో మిగతా బంగారం వ్యాపారుల్లో ఆందోళన మొదలైంది. తనిఖీలు తమ వరకు వస్తాయన్న ఆందోళనతో బంగారం, స్వర్ణకారులు తమ దుకాణాలను మూసివేశారు. దసరా పండుగ సమయంలో బంగారు దుకాణాలన్నీ మూతపడడంతో కొనుగోలుకు వచ్చిన వినియోగదారులు నిరాశ చెందారు.

దూదేకుల సింహగర్జనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- రాయచోటి

ఆంధ్రప్రదేశ్ నూర్‌బాషా దూదేకుల, ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29న గుంటూరులో నిర్వహించబోయే నూర్‌బాషా దూదేకుల సింహ గర్జన సభను జయప్రదం చేయాలని జిల్లా, అధ్యక్షులు నడిగడ్డ హిమాములు, నియోజకవర్గ నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధానకార్య దలు గాండల్లపెంట ఖాదర్ బాషా,గగ్గుటూరి మస్తాన్ వలి పిలుపునిచ్చారు. ఆదివారం మాసాపేటలోని నూర్‌బాషా దూదేకుల భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో 25 లక్షలకు పైగా దూదేకుల కులస్తులున్నారన్నారు. రాష్ట్రజనాభాలో 4 శాతంగా ఉన్న తమను అన్ని రాజకీయ పార్టీలో ఓటు బ్యాంక్‌గానే చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దూదేకులకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించాలని, ఏ రాజకీయ పార్టీ అయితే తమ కులానికి చట్టసభల్లో స్థానం కల్పిస్తారో వారికే తమ కులస్తుల మద్దతు ఉంటుందని చెఉప్పారు. రాజ్యాంగం ప్రకారం తమ కులానికి రావాల్సిన వాటాను, హక్కులను మాత్రమే అడుగుతున్నామన్నారు.రాష్ట్రంలో ఒక్క శాతం ఉన్న కులాలు చట్టసభలకు వెలుతున్నారని, 4శాతం ఉన్న దూదేకుల వారికి ఇప్పటివరకు చట్టసభల్లో ఏ

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నూర్‌బాషా దూదేకుల సంఘం నాయకులు

రాజకీయపార్టీ స్థానం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం చలో సింహ గర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో , రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండూరు మహమ్మద్ షఫీ, పక్కిర్ సాహిబ్ , సంఘనాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : 'సుగవాసి'

విజేతలతో సుగవాసి ప్రసాద్‌బాబు

విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి- రాయచోటి

క్రీడల వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని టిటిడి పాలక మండలి మాజీ సభ్యులు, రాయచోటి నియోజకవర్గ టిడిపి నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని మాసాపేటలో జిల్లా వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మాసాపేట క్రికెట్ క్లబ్(ఎంసిసి) ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని, అందరూ స్నేహభావంతో,ఐకమత్యంతో ఎటువంటి సమస్యలు లేకుండా టోర్నమెంట్‌ను ప్రశాంత వాతావరణంలో జరిపించినందుకు కార్యనిర్వాహకలను అభినందించారు. పోటీలలో విజేతలకు విన్నర్స్ జట్టు ఆర్‌సిబి 11కు రూ.60 వేలు, రన్నర్స్ జట్టు 11కు రూ.30 వేలు చొప్పున నగదు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సుగవాసి శ్రీనివాసులు, వార్డు కౌన్సిలర్ సుగవాసి ఈశ్వర్ ప్రసాద్,సుగవాసి శ్యామ్ కుమార్,ఎస్.యన్.ఎస్ రైస్ మిల్ ఓనర్ సుగవాసి మురళి మోహన్ ,నవాజ్, సీనియర్ క్రీడాకారులు సనావుల్లా, ముత్తుకూరు రఫీ,బడిశెట్టి రవి, తోహిద్ ఖాన్ పాల్గొన్నారు.

టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ప్రదానం

నియోజకవర్గంలోని కాటిమాయకుంట గ్రామపంచాయతీలోని బొట్లచెరువు గ్రామంలో దసరా పండగ సందర్భంగా నిర్వహించిన మండిపల్లి యువ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు నియోజకవర్గ టిడిపి నాయకుడు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విన్నర్స్ ,రన్నర్ జట్లకు ప్రైజ్ మనీ , ట్రోఫీ బహుమతులు అందజేశారు విన్నర్స్ టీం రూలింగ్ రాయల్స్‌కు రామ్‌ప్రసాద్‌రెడ్డి రూ. 20 వేలు, రన్నర్స్ 11ఎస్‌కు టీమ్‌కు కొండా భాస్కర్‌రెడ్డి రూ. 15 వేలు అందజేశారు. అనంతరం టోర్నమెంట్ ఆర్గనైజర్స్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కొండా గంగిరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రఘునాథ, నాగార్జున నాయుడు, వేణు, మహబూబ్ బాషా, చంద్రశేఖర, కిరణ్, బాలు, ఉమేష్, రామంజి, పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపుదాం

ప్రజాశక్తి- రాయచోటి

ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించి, ప్రజా సంక్షేమం కొనసాగించే పార్టీని అధికారంలోకి తీసుకురావాలని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ముకరం చాంద్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని జన సేన పార్టీ కార్యాలయం లో అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి షేక్ హసన్ బాషా ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో మండలాల నాయకులు, కార్యకర్తలు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ˊమావేశంలో పలువురు పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి జనసేన నాయకులు ఆహ్వానించారు. రాష్ట్ర కార్యదర్శి ముక్రం ఛాన్ మాట్లాడుతూ జనసేన చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాను ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ాార్యక్రమంలో పట్టణ నాయకులు పఠాన్, ప్రదీప్, షబ్బీర్, నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షుడు జయరామ్, జనసేన వివిధ మండలాల నాయకులు గేట్ బాబ్జి, కొండా, భారత్,దినేష్, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ నాయకులు రామ శ్రీనివాస్,ఉమ్మడి కడపజిల్లా కార్యక్రమాల సభ్యులు రియాజ్, వీరమహిళలు రెడ్డిరాణి, రూప, జనసైనికులు బాలాజీ, ఖాసిమ్, ఎహెసన్, ఫాహాద్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ముకరం చాంద్

అష్ఫాకుల్లా ఖాన్ స్ఫూర్తితో బిజెపి విధానాలను ఎండగడదాం

ప్రజాశక్తి-కడప అర్బన్

స్వాతంత్ర్య సమర యోధుడు, యువత ఆశాకిరణం అష్ఫాకుల్లా ఖాన్ స్ఫూర్తితో బిజెపి మతోన్మాద విధానాలను ఎండగడదాం, విభజన హామీల కోసం ఉద్యమిద్దాం అని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివ కుమార్ తెలిపారు. ఆదివారం అష్ఫాకుల్లా ఖాన్ జయంతి సందర్భంగా డివైఎఫ్ఐ అధ్వర్యంలో కడపలో పాత బస్టాండ్ జిల్లా కార్యాలయ లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అష్ఫాకుల్లా ఖాన్ పాత్ర కీలకమైనది అన్నారు.దేశ స్వాతంత్ర్యం కోసం 27 సంవత్సరాల వయస్సులో ప్రాణాలను అర్పించారు ధీరుడు అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో మత సామరస్యం పాటించి మతోన్మాదాన్ని వ్యతిరేకంగా ఉద్యమించారని తెలిఆపరు. నేడు బిజెపి ప్రభుత్వం త్యాగధనులను మరచింది అన్నారు. కులాలు, మతాల పేరుతో దాడులకు పాల్పడుతున్నారు అన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని వాపోయారు. ప్రధానంగా విభజన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చట్టబద్ధంగా రాసుకున్నా పరిశ్రమ ఏర్పాటు చేయడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రాన్ని నిలదియకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని వాపోయారు. కేవలం ఎన్నికల స్టంట్ లాగా కడప ఉక్కు పరిశ్రమను ఉపయోగించుకుంటున్నారు అన్నారు. కడప ఉక్కు సాధించుకుందాం అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర అద్యక్షులు షాకీర్,ఉపాధ్యక్షులు విజయ్ పాల్గొన్నారు.

జల వనరులను కాపాడడమే లక్ష్యం

జిల్లా జలవనరుల అధికారి బి.కృష్ణమూర్తి

ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలోని చెరువులలో నీటిని కలుషితం కాకుండా పొదుపు చేసుకుంటూ జల వనరులను కాపాడు కోవడమే తమ లక్ష్యమని జిల్లా జలవనరుల అధికారి బి. కృష్ణమూర్తి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో రైతులు నీటిని ఎలా పొదుపు చేసుకుని చెరువుల కింద పంటలను ఎలా సాగు చేసుకోవాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలో జలవనరుల కార్యాలయాల వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా డివిజన్ కార్యాలయాలు మదనపల్లె, కడప, కదిరి ప్రాంతాలలో ఉన్నాయి. సబ్ డివిజన్ కార్యాలయాలు రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, గాలివీడు, మదనపల్లి, తంబళ్లపల్లి, వాల్మీకపురం, రాజంపేట, రైల్వే కోడూరు ప్రాంతాల్లో ఉన్నాయి.

జల వనరుల కార్యాలయం పని వివరాలు తెలపండి?

జిల్లావ్యాప్తంగా జలవనరుల అధికారులు రైతులకు అందుబాటులో ఉండి చెరువులను పునరుద్దించడం, రిజర్వాయర్‌లకు అవసరమైన మరమ్మతులు చేపట్టడం, తెగిపోయిన చెరువులను పునరుద్ధరించడం మొదలగు పనులు చేపడతాం.

జిల్లాలో ఎన్ని రిజర్వాయర్‌లున్నాయి?

జిల్లా వ్యాప్తంగా మేజర్ రిజర్వాయర్లు చిన్నమండం మండలంలో శ్రీనివాసపురం రిజర్వాయర్, మీడియం రిజర్వాయర్లు రాజంపేట మండలం అన్నమయ్య ప్రాజెక్టు, గాలివీడు మండలం వెలుగెళ్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయలున్నాయి. మైనర్ రిజర్వాయర్లు నిమ్మనపల్లి మండలం బహుదా, తంబళ్లపల్లె మండలం పెద్దూరు రిజర్వాయార్, సంబేపల్లి మండలం జరికోన రిజర్వాయర్, టి సుండుపల్లి మండలం పింఛా రిజర్వాయర్లున్నాయి.

జిల్లావ్యాప్తంగా ఎన్ని చెరువులు ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా 3,272 చెరువులు, ఆయకట్టు 1,00,073 ఎకరాలున్నాయి.. 100 ఎకరాల పైబడి ఆయకట్టు కలిగిన 154 చెరువులు, ఆయకట్టు 53407 ఎకరాలు ఉన్నాయి. 100 ఎకరాల లోపు ఆయకట్టు చెరువులు 3118, ఆయకట్టు 46666 ఎకరాలు ఉన్నాయి.

గతంలో తెగిన ప్రాజెక్టుకు మరమ్మతులు చేపడుతున్నారా?

2021 సంవత్సరం నవంబర్‌లో అతిభారీ వర్షాలకు అన్నమయ్య ప్రాజెక్టు, పింఛా ప్రాజెక్టులు తెగిపోయాయి. అన్నమయ్య ప్రాజెక్టు పునర్మాణానికి రూ. 787,77 కోట్లు, పింఛా ప్రాజెక్ట్ పునర్నిర్మాణానికి 84.33 కోట్ల బడ్జెట్ మంజూరైంది .పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. అన్నమయ్య ప్రాజెక్టుకు పునరుద్ధరణకు రూ. 787.77 కోట్లకు అనుమతులు వచ్చినవి టెండర్ ప్రక్రియ పూర్తయింది. త్వరలో పనులు ప్రారంభిస్తాం. తెగిపోయిన చెరువులకు అంచనాల తయారు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాం. రాగానే పనులు ప్రారంభిస్తాం.

జిల్లాలో లిఫ్టు స్కీములు ఏమైనా మంజూరయ్యాయా?

జిల్లాలో ఐదు లిఫ్టు స్కీమ్‌లు మంజూరయ్యాయి. గాలివీడు మండలంలో వెలిగల్లు లిఫ్ట్ స్కీమ్‌కు రూ.94.56 కోట్లతో అనుమతులొచ్చాయి. జరికోన లిఫ్ట్ స్కీంకు రూ.42.25 కోట్లకు అనుమతులొచ్చాయి. రామాపురం లిఫ్ట్ స్కీమ్‌కు రూ.29.38 అనుమతులొచ్చాయి. జిఎన్‌ఎస్‌ఎస్ నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు అనుసంధానం లిఫ్ట్ స్కీముకు రూ. 5036.00 కోట్లకు అనుమతులొచ్చాయి.

రైతులకు ఏమైనా సలహాలు ఇవ్వాలనుకుంటున్నారా?

ఈ ఏడాదిలో ఇప్పటి వరకు వర్షపాతం తక్కువగా నమోదైంది. రిజర్వాయర్లు, చెరువులలో నీటి లభ్యత తక్కువగా ఉంది. ఇలాంటి పరిస్థితులలో రైతులు నీటిని హేతుబద్ధంగా తక్కువగా వాడుకవాలి. తక్కువ నీటితో ఎక్కువ పంట రాబడి వచ్చే పంటలు సాగు చేసుకోవాలి. వరికి బదులు తృణధాన్యాలు వంటివి సాగు చేసుకుని నీటిని పొదుపు చేసుకోవాలి.

కేశాలు దానం చేస్తున్న రఫియా అంజూమ్, గాయత్రి

నిరసన తెలుపుతున్న ఇండియన్ లేబర్ పార్టీ నాయకులు

కేశాలు దానం చేసిన యువతులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి ముఖ్య కేంద్రంగా రక్తదానం, ఫుడ్ బ్యాంక్, ప్యాడ్ బ్యాంక్ సేవలతో పాటు కేన్సర్ భాదితులకు మానసికంగా అయిన తోడుగా నిలవాలనే గొప్ప ఆశయంతో హెల్పింగ్ మైండ్స్ హెయిర్ డోనేషన్ కార్యక్రమానికి మహిళలు, చిన్నారులు స్వచ్ఛందంగా తమ కేశాలను దానం చేసి గొప్ప మనసస్సును చాటుకుంటున్నారు. మదనపల్లి పట్టణానికి చెందిన రఫియా అంజూమ్, గాయత్రి తమ కేశాలను దానం చేశారు. వీరికి హెల్పింగ్ మైండ్స్ బృందం ప్రశంస పత్రంతో పాటు పూలమొక్కలు బహుకరించి అభినందించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ కేన్సర్ బాధితుల కోసం గొప్ప మనసును చాటుకుంటున్న చిన్నారులు, యువతులు, మహిళల సేవలు అభినందనీయమని ఇప్పటికి 40 మంది కేశాలు దానం చేశారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా కేన్సర్ బాధితులకు ఉచితంగా విగ్గులు తమ సంస్థ అందిస్తుందని పేర్కొన్నారు.

వైసిపి జిల్లా ముఖ్య సభ్యునిగా ముత్ర దామోదర్‌రెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అన్నమయ్య జిల్లా వైసిపి జిల్లా ముఖ్య సభ్యునిగా తంబళ్లపల్లి నియోజకవర్గం, కురబలకోట మండలానికి చెందిన ముత్ర దామోదర్ రెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తంబళ్లపల్లి నియోజకవర్గంలో వైసిపి బలోపేతానికి ముత్ర దామోదర్ రెడ్డి అలుపెరుగని కృషి చేశారన్నారు. ఆయన సమర్ధతను గుర్తించి పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరుగా నియమించడం హర్షణీయమన్నారు. ముత్ర దామోదర్ రెడ్డి మాట్లాడుతూ జననేత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, యువనేత రాజంపేట ఎంపీ, లోకసభ ప్యానెల్ స్పీకర్ పి.వి.మిథున్ రెడ్డికి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర పార్టీ పిలుపు మేరకు పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ప్రతిపక్ష పార్టీల ఆరోపణలు తిప్పి కొడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపి విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు.

సోషల్ మీడియా చాలా కీలకం : ఆర్ఆర్

ప్రజాశక్తి - రాయచోటి

రాబోయే ఎన్నికల్లో సోషల్ మీడియా చాలా కీలకం అని మాజీ శాసన సభ్యులు, టిడిపి ఇన్‌ఛార్జి ఆర్. రమేష్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సోషల్ మీడియా మిత్రుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో సోషల్ మీడియా చాలా కీలకమన్నారు. ఈ నాలుగున్నర సంవత్సరాలలో వైసిపి ప్రజలకు తీవ్రంగా అన్యాయం చేసిందని గ్రామ స్థాయి లో నెలకొన్న ప్రతి సమస్యను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియ జేయాలని పేర్కొన్నారు. వైసిపిచేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేయాలని ఆయన కోరారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయానికి ప్రతి ఒక్కరి కృషి అవసరమని చెప్పారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, సోషల్ మీడియా విభాగం ప్రతి నిధులు రాంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగ యువత ఉద్యమించాలి

బద్వేలు : నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని దీని కోసం నిరుద్యోగ యువతీ యువకులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపైన ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని పిలుపునిచ్చారు ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ నాయకులతో కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చదువుకున్నటువంటి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కడప జిల్లాలో అనేక వనరులున్నప్పటికీ వాటి ఆధారంగా కొన్ని పరిశ్రమలు నెలకొల్పడంలో అటు కేంద్ర ప్రభుత్వం ఇటు రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లాలో చదువుకున్నటువంటి అనేకమంది యువతీ యువకులు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక ఇతర దేశాలకు ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లి బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకమంది యువతీ యువకులు ఉద్యోగాలు రాక ఈ మధ్యకాలంలో ఆత్మహత్యలు చేసుకున్నారని వారు తెలిపారు.

బెస్ట్ అవెలబుల్ స్కూల్స్‌ను కొనసాగించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బెస్ట్ అవెలబుల్ పాఠశాలలు కొనసాగించాలని ఇండియన్ లేబర్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు లింగం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం అంబేద్కర్ విగ్రహం వద్ద పాఠశాలలు పునరుద్ధరణ కోరుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లింగం నాగేశ్వరరావు మాట్లాడుతూ హై కోర్టు న్యాయవాది, మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గుర్రం రామారావు బెస్ట్ అవెలబుల్ పాఠశాలలు కొనసాగించాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్పందించలేదని అన్నారు. వచ్చే ఎన్నికలలో వైసిపి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కులమతాలకతీతంగా లేబర్ పార్టీకి అండగా నిలిచి అనాథ పిల్లల చదువు కోసం బెస్ట్ అవైలబుల్ పాఠశాలలు సాధించుకునేందుకు కలిసికట్టుగా కృషి చేసేందుకు కలిసి రావాలని పిలుపునిచ్చారు.

మహేష్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

మైఫోర్స్ మహేష్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన జనసేన పార్టీ నాయకులు మైఫోర్స్ మహేష్‌కు ఆ పార్టీ నాయకులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చేతుల మీదుగా రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియామక పత్రం అందుకుని మదనపల్లికి తిరిగి వచ్చిన మహేష్‌కు పట్టణంలోని తట్టివారి పల్లి సర్కిల్లో చిత్తూరు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు అమర్ నారాయణ ఆధ్వర్యంలో జనసేన పార్టీ నాయకులు శంకర్ రాయల్ , జలజమ్మ, రామ్మూర్తి, తంబాలపల్లి నాయకులు నాగరాజు , పీలేరు నాయకులు తలపరవి, పుంగనూరు నాయకులు చైతన్య రాయల్ ఆధ్వర్యంలో బాణాసంచాలు పేల్చి గజమాలతో ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి మదనపల్లి పట్టణ వీధుల మీదుగా అంబేద్కర్ సర్కల్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అభిషేకం చేసి నివాళు లర్పించారు. చిత్తూరు-బెంగళూరు బస్టాండ్ మీదుగా భారీ ర్యాలీగా వెళ్లి మల్లికార్జున సర్కిల్‌లో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం దగ్గర పాలాభిషేకం చేసి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో పవన్ కల్యాణ్ రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇకనుంచి జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతం కృషి చ్సేత్తనన్నారు. పడమటి నియోజకవర్గం మదనపల్లి తంబాలపల్లి, పుంగనూరు, పీలేరు, రాయచోటి, రాజంపేట నియోజకవర్గం వచ్చే ఎన్నికల్లో జనసేన టిడిపి కూటమిని ప్రతి నియోజకవర్గంలో గెలిపించే విధంగా టిడిపి నాయకులతో సమన్వయం చేసుకుంటూ గెలుపే ధ్యేయంగా పనిచేస్తానని తెలియజేశారు. జనసేన పార్టీ అభివృద్ధి కోసం ప్రతి నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లి జనసేన పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మహేంద్ర, రతీష్, జగదీష్, గంగాధర, ప్రవీణ్, మధు, అప్సర్, షమీ, రమణ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన సర్పంచ్

పీలేరు : పీలేరు-చిత్తూరు మార్గంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ వెనుక వైపు ఉన్న డంపింగ్ యార్డ్‌ను ఆదివారం సర్పంచ్ షేక్ జీనత్ షఫీ పరిశీలించారు. డంపింగ్ యార్డ్ అక్కడ ఉండడం వల్ల తమకు సమస్యగా ఉందంటూ అక్కడికి దగ్గర్లోని వైఎస్సార్ కాలనీ వాసులు, మాజీ సైనికుల కాలనీ లబ్ధిదారులు ఫిర్యాదు చేయడంతో, సర్పంచ్, పంచాయతీ ఇఒ సిబ్బందితో కలిసి సందర్శించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు అక్కడి సమస్యను చూసి తెలుసుకున్నారు. త్వరలో డంపింగ్ యార్డ్ వేరొకచోటికి మార్చి సమస్యను పరిష్కరిస్తామని, అందుకు కొంతకాలం పడుతుందని సర్పంచ్ చెప్పారు. కార్యక్రమంలో ఇఒ రెడ్డి ప్రసాద్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు దాతృత్వం ప్రకటిస్తున్న నాయకులు

దాతల దాతృత్వం మరువలేనిది

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడలో వెలసిన మానవతా సేవా సంస్థ సేవలు ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటూ అందరి మన్ననలు పొందుతోంది. ఆదివారం మండలంలో మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో చేసిన పర్యటనలో పలువురు తమ దాతృత్వం చాటుకున్నట్లు సమస్త ఛైర్మన్ సుధాకర్ తెలిపారు. మండలంలోని గంగాపురానికి చెందిన మద్దిపట్ల వెంకటరమణ నాయుడు రూ.24 వేలు, బాసానిరెడ్డి, గోపాల్‌నాయుడు రూ.10 వేలు, గాలివారిపల్లి రాఘవేంద్ర చౌదరి రూ.10వేలు, అశోక్ కుమార్ రూ.2వేలు, రామచంద్ర రూ.2వేలు, రూపాయలు, కిరణ్ వెయ్యి, రెడ్డప్ప నాయుడు రూ.2వేలు, సుధాకర్ రూ.2వేలు, హరీష్ రూ.2వేలు అచ్చమ్మ వెయ్యి రూపాయలు మరో 20 మంది సభ్యులు ఒక్కొక్కరు రూ.600 చొప్పున సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు.మండల ప్రజలకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అన్ని విధాలుగా సేవ చేయడానికి ముందుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గంగాద్రినాయుడు, శ్రీనివాసులురెడ్డి ,మండలశాఖ అధ్యక్షులు వెంకటసుబ్బయ్య ,సభ్యులు వైవిరమణ, ఖాజా పీర్, వెంకటేశ్వర, జవి రమణ పాల్గొన్నారు.

కరువు ప్రాంతంగా ప్రకటించండి

ప్రజాశక్తి-రామాపురం

మహిళా రైతు శ్రీదేవి

మండలంలో గత రెండు సంవత్సరాలుగా వర్షాలు సరిగ్గా పడకపో వడంతో పంటలు బీడు భూములు మారాయని రామాపురం మండలాన్ని కరువు మండలంగా ఆదుకోవాలని ఉత్తమ మహిళా రైతు శ్రీదేవి అన్నారు. స్థానిక రామాపురంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు వర్షానికి పంటలు సాగు చేసేవారని వర్షం పడకపో వడంతో భూములన్ని బీడుగా మారాయని రైతులందరూ ఆందోళన చెందు తున్నాని అన్నారు. ఈ ఏడాది మండలంలో 20శాతం మాత్రమే వర్షం పడిందని అన్నారు. వేరుశనగ, వరి, కూరగాయల పంటలు ఈ మండలంలో ఎక్కువ పండించే వారని వర్షం రాకపోవడంతో పంటలు బీడుగా మారిపో యాయని అన్నారు. ఈ మండ లంలో ఎక్కువగా ఆవులు, గేదలు, మేకలు, గొర్రెలు, ఉన్నాయని వాటికి మేత లేక కబేలాలకు తరలించే అవకాశ ముందన్నారు. గడ్డి లేక పశువులు బక్కచిక్కి పోతున్నాయని ప్రభుత్వం వాటికి దాన మంజూరు చేయాలన్నారు. మండ లంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడుతో మనోహర్‌నాయక్

అచ్చెన్నాయుడును కలిసిన మనోహర్‌నాయక్

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మంగళగిరిలోని టిడిపి జాతీయకార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడిని రాష్ట్ర ఎస్‌టిసెల్ కార్యదర్శి మనోహర్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. టిడిపి గిరిజన కార్యకర్తలు నాయకులు మీద జరుగుతున్న దాడులు మీద పార్టీ నాయకుల గురించి, రాష్ట్రంలో జరుగుతున్నటువంటి గిరిజన ప్రజల మీద దాడులపై చర్చించినట్లు తెలిపారు. బాలికల మీద హత్యాయత్నాలు, వైసిపి రాష్ట్ర ప్రభుత్వం గిరిజన పథకాలు రద్దు చేసిన విధానాలను ఆయన దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో పలు ఆలయాలలో ఎనిమిదవ రోజు దుర్గాదేవి అలంకరణతో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. మల్లయ్య కొండపై వెలసిన గౌరీదేవి ఆలయంలో అమ్మవారికి పూజారి శేఖర్‌గా దుర్గాదేవి గా అలంకరించి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు. మహిళలు, భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు.

రాజంపేటలో కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ నిలుపుదల

ప్రజాశక్తి-పుల్లంపేట

జిల్లా కేంద్రంలోని రాజంపేట పార్లమెంటు నియోజకవర్గం కేంద్రంలలో ఉన్న రాజంపేట, రైల్వే స్టేషన్లలో గతంలో జయంతి, కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ నిలుపుదలకు అనుమతులు మంజూరు అయ్యాయని గుంతకల్ డివిజన్ రైల్వే బోర్డు సభ్యులు తల్లెంభరత్ కుమార్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో కొన్ని స్టేషన్‌లో నిలుపుదలకు లేకుండా రైల్వే శాఖ అధికారులు నిర్ణయం తీసుకోవడంతో ఈ స్టేషన్లలో నిలుపుదల లేకుండా పోయిందన్నారు. ప్రస్తుత పరిస్థితులలో శబరిమలైకి వెళ్లే భక్తులకు, రవాణా సరఫరా చేసుకునే రైతులకు వీలుగా నిలుపుదల కల్పించాలని ప్రజలు, ప్రయాణికులు గుంతకల్ డివిజన్ రైల్వే బోర్డు సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లనట్లు తెలిపారు. ఈ విషయాన్ని బోర్డు సమావేశంలో అధికారులు దృష్టికి తీసుకెళ్లి కచ్చితంగా మా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నిలుపుదలకు అనుమతిని కల్పించాలని కోరినట్లు తెలిపారు. ప్రజలఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కేంద్ర మంత్రి అశ్విన్ వైష్ణవ్ దృష్టికి కూడా తీసుకెళ్లడంతో వెనువెంటనే అధికారులకు ఆదేశాలు జారీ చేసి రైలు నిలుపుదలకు అవకాశం కల్పించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు.

ప్రొద్దుటూరులో ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

దసరా పండు గరోజు భక్తులు, ప్రజల సౌకర్యార్థం ప్రొద్దుటూరులో ట్రాఫిక్‌ను మళ్లించినట్లు ఎఎస్‌పి ప్రేరణకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు దసరా రోజు శమీదర్శన ఉత్సవం సందర్భంగా ట్రాఫిక్ మళ్లించామన్నారు. అమ్మవారిశాల నుండి దర్గా బజార్, లైట్‌పాలెం, శివాలయం, రాజీవ్‌సర్కిల్, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ మీదుగా కొర్రపాడు రోడ్డులోని పెద్దమ్మచెట్టు వరకు భక్తుల రద్దీ వల్ల ఆ ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయన్నారు. పట్టణంలోని బస్టాండు నుండి గాంధీరోడ్డు వైపునకు గాంధీరోడ్డు, వైయంఆర్ కాలనీ నుండి బస్టాండ్ వైపు వెళ్లేవారు రింగ్‌రోడ్డు మీదుగా రాకపోకాలు సాగించాలన్నారు. హోమస్‌పేటలో సెంట్రల్ పార్కింగ్ చేయకూడదన్నారు. లారీ వంటి పెద్దవాహనాల ఆంక్షలు యథావిధిగా కొనసాగుతాయన్నారు.

రేపు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా మంగళవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పులివెందుల ఆర్‌టిసి ఇన్‌ఛార్జి డిపో మేనేజర్ గోవర్ధనరెడ్డి తెలిపారు. ఆ మేరకు మంగళవారం ఆయన ఆదివారం డిపో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10 నుంచి 11గంటల వరకు ప్రయాణికుల ఫోన్ కాల్స్‌కు సమాధానం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు తమ అమూల్యమైన సూచనలు, విన్నపాలు, ఫిర్యాదులు తెలపవచ్చన్నారు. కార్యక్రమంలో 99592 25780కు ఫోన్ చేయాలన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి -నందలూరు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిఎంహెచ్ఒ కొండయ్య వైద్యులను ఆదేశించారు. ఆదివారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పిహెచ్‌సిలో రికార్డులను పరిశీలించారు. అనంతరం పిహెచ్‌సి హెల్త్ బ్లాక్, నూతన భవనం నిర్మాణ స్థలాన్ని సందర్శించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ సృజన మాట్లాడుతూ 11 జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించినట్టు తేలిపారు. జెఎఎస్ శిబిరం ద్వార పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి ఆరిఫ్ బాబు, ఎంపిహెచ్‌ఎ లక్షుమయ్య పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ కొండయ్య

టిడిపి గెలుపునకు కృషి చేయాలి

ప్రజాశక్తి-ములకలచెరువు

టిడిపి గెలుపుకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని టిడిపి మండల కన్వీనర్ పాలగిరి సిద్ధ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన మొలకలచెరువులో టిడిపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం టీడిపి మండల కన్వీనర్ పాలగిరి సిద్ధ, జనసేన మండల కన్వీనర్ పోతులసాయినాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిద్ధ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తంబలపల్లిలో టిడిపి జెండా ఎగురవేయాలి అన్నారు. జనసేన పార్టీ నాయకులు, టిడిపి నాయకులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి ఎవరిక టికెట్ కేటాయించిన గెలుపుకు కృషి చేయాలి అన్నారు. పార్టీ కార్యక్రమాలు జరగని వ్వకుండా పలువురు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆరోగ్యంగా ఉండి త్వరగా బెయిల్ పై బయటకు రావాలన్నారు. కార్యక్రమంలో ఇరు పార్టీల నాయకులు నాయకులు, శ్రీనివాసులు, భావజాన్, పవన్‌రెడ్డి, టిడిపి నాయకులు భజంత్రీ రామా నుజులు, రాచమల్లు నాగరాజ్ యాదవ్, కేవీ. రమణ, చెన్నకృష్ణ , చింతకుంట్ల కేశవ, మౌల, వెంకటస్వామి, కాల మహేష్, సుదర్శన్ యాదవ్,విజయ్ కుమార్, గాండ్లరెడ్డెప్ప చాంద్‌బాషా , బుర్ర రమణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ పాలగిరిసిద్ధ

ఓటమి భయంతోనే అక్రమ కేసులు

మాట్లాడుతున్న మాజీమంత్రి అమర్నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

వైసిపి నాయకుల్లో ఓటమి భయం పట్టుకుందని, అందుకే టిడిపి శ్రేణులపై భౌతిక దాడులు చేస్తూ అక్రమ కేసులు బనాయించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని టిడిపి నాయకులు, మాజీ మంత్రి ఎన్.అమర్నాథ్‌రెడ్డి తెలిపారు. పుంగనూరు, అంగళ్లు కేసుల కండీషన్ బెయిలులో భాగంగా రెండు వారాలపాటు ప్రతి ఆది, గురువారాల్లో పీలేరు పోలీసు స్టేషన్లో సంతకాలు చేయాలన్న రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఆదివారం ఆయన మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, రాజంపేట టిడిపి ఎంపి అభ్యర్థి గంటా నరహరితో కలిసి పీలేరు పోలీసు స్టేషనుకు వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. పుంగునూరు నియోజకవర్గం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు సొంత జాగీరుగా భావిస్తున్నారని అందుకే ప్రతిపక్ష పార్టీల నాయకులను నియోజకవర్గంలోకి రానీకుండా అడ్డుకుంటూ భౌతిక దాడులకు పాల్పడుతున్నారని వారన్నారు. తమ నియోజకవర్గంలో ప్రతిపక్షాలకు చోటు, వారి కదలికలు ఉండకూడదన్న నియంతృత్వ ధోరణి అవలంబిస్తున్నారని ఆరోపించారు. అందుకు సుగాలిమిట్ట ఉదంతం ఓ సజీవ సాక్ష్యమని చెప్పారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ శ్రీకాకుళం నుంచి కుప్పం వరకు సైకిల్ యాత్ర చేపట్టిన టిడిపి కార్యకర్తలను అడ్డుకోవడం, వారి బట్టలు ఊడదీయడం, వారిని కొట్టడం, ఆ దృశ్యాలను వారే చిత్రీకరించి సోషియల్ మీడియాలో పెట్టడం చూస్తుంటే వారి నియంతృత్వ ధోరణి పరాకాష్టకు చేరిందనిపిస్తోందన్నారు. ఆ వీడియోలు వైరల్ కావడంతో పుంగనూరు పోలీసులు కంటి తుడుపు చర్యగా బెయిలబుల్ సెక్షన్ల కింద నామమాత్రపు కేసులు వేసి 41 నోటీసు ఇచ్చి వదిలేశారని విమర్శించారు. పుంగనూరు నియోజకవర్గంలో స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి అనేక దశాబ్దాలపాటు తాను, తన తండ్రి, తన తాత రాజకీయాలు చేశామని, ఏనాడూ కక్షపూరితమైన రాజకీయాలు చేయలేదని గుర్తు చేశారు. వారు ఎన్ని అల్లర్లు సృష్టించినా వచ్చే ఎన్నికల్లో ప్రజలు వారిని శంకరగిరి మాన్యాలు పట్టించడం ఖాయమని జోస్యం చెప్పారు. టిడిపి అభివృద్ధి, సంక్షేమం, సిద్ధాంతంతోనే రాజకీయాలు చేసిందని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత వైసిపి వారిని వేధించడం ఉం డదని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు వైసిపి వారు ప్రవర్తించినట్టు తామూ ప్రవర్తిస్తే ఇక వారికీ, తమకు తేడా ఏముంటుందన్నారు. వేధింపులు, అక్రమ కేసుల పర్వం తన స్వంత నియోజకవర్గమైన పలమనేరుకు కూడా పాకిందని, గత రెండు రోజులుగా సోషియల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే టిడిపి కార్యకర్తలను అరెస్టులు చేస్తున్నారన్నారు.అరెస్టు సమయంలో బాధతో మరణించిన వారి కుటుంబాలను పరామర్శించేందుకు ఆయన సతీమణి నారా భువనేశ్వరమ్మ ఈ నెల 25వ తేదీ నుంచి న్యాయం గెలవాలి, నిజం బతకాలి పేరుతో యాత్ర చేపట్టనున్నారని తెలిపారు. టిడిపి శ్రేణులు, అభిమానులు, ప్రజాస్వామ్య ప్రేమికులు, చంద్రబాబు అరెస్టును వ్యతిరేకించే వారుఅధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైసిపి ప్రభుత్వంలో వాతలు, కోతలే : పిసిసి

పజాశక్తి - వేంపల్లె

ఎన్.తులసిరెడ్డి

వైసిపి ప్రభుత్వంలో వాతలు, కోతలేనని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక వైపు కరెంటు కోతలతో.. మరో వైపు పెరిగిన కరెంటు ఛార్జీల వాతలతో ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. జగన్ పాలనలో కరెంటు బిల్లులు ముట్టుకుంఏ షాక్ కొడుతున్నాయన్నారు. 2019 ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలు పెంచకుండా ఇంకా తగ్గిస్తామని జగన్ ప్రచారం చేశారని తెలిపారు. జగన్ మాటలను విని ప్రజలు ఓట్లు వేసి గెలిపించారన్నారు. అధికారంలోకి వచ్చాక మాట తప్పి బాదుడు కార్యక్రమాన్ని మొదలు పెట్టారని విమర్శించారు. నాలుగున్నర సంవత్సరాల కాలంలో 8 సార్లు కరెంటు ఛార్జీలు పెంచారని చెప్పారు. అదనపు భారం కింద దాదాపు రూ.50 వేల కోట్లు ప్రజలపై వేశారన్నారు. అసలు కంటే కొసరు ఎక్కువైనట్లు స్థిర ఛార్జీలు, కస్టమర్ సర్వీస్ ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు, విద్యుత్ సుంకం ఇలా రకరకాల పేర్లతో పెంచారన్నారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్ల బిగింపు పేరుతో రూ.13000 కోట్లు, వ్యవసాయ పంపు సెంట్లకు స్మార్ట్ మీటర్ల బిగింపు పేర్లతో రూ6888 కోట్లు అదనపు భారం మోపేందుకు వైసిపి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాబోవు ఎన్నికల్లో విద్యుత్ వినియోగదారులు వైసిపిని చిత్తు చిత్తుగా ఓడించి రివర్స్ షాక్ ఇస్తారని తులసిరెడ్డి పేర్కొన్నారు.

అధికారులు సినిమా హాళ్లను తనిఖీ చేయాలి

- డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్‌రాజ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సినిమా హాళ్లను అధికారులు తనిఖీ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్ రాజ్ డిమాండ్ చేశారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మా ట్లాడుతూ స్థానికంగా సినిమా థియేటర్లలో పార్కింగ్ ఫీజు వసూలు ఆపా లన్నారు. సినిమా థియేటర్ లోపల తినుబండారాల పేరుతో అధిక రేట్లకు అమ్ముతున్నా చోద్యం చూస్తున్న యాజమా న్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన హీరోలా సినిమాల విడుదల సం దర్భంగా అధిక రేట్లకు టిక్కెట్లు అమ్ముతున్న యాజమాన్యాలపై చర్యలు తీసు కోవాలన్నారు. సినిమా థియేటర్స్‌కి వచ్చే ప్రేక్షకులకు కనీస సౌకర్యాలు లేవ న్నారు. వెంటనే ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని పక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సినిమా థియేటర్స్ ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరి స్తున్నామన్నారు. డివైఎఫ్ఐ నాయకులు శ్రీహరి, శివ పాల్గొన్నారు.

కె.రాజుపల్లె మంచినీటి పథకానికి మహర్దశ..!

ప్రజాశక్తి - చక్రాయపేట

కడప పార్లమెంటు సభ్యులు వైయస్ అవినాష్‌రెడ్డి చొరవతో కె.రాజుపల్లె గ్రామంలోని మంచి నీటి పథకానికి మహర్దశ వచ్చింది. కొంతకాలంగా పైప్‌లైన్ లీకేజీలతోపాటు కొన్ని సాంకేతిక కారణాల వల్ల నీటి పథకం పనిచేయలేదు. సమస్యను ఇటీవల ఎంఎ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన సంబంధిత శాఖ అధికారులతోపాటు కాంట్రాక్టర్ మూలపల్లె రంగారెడ్డిని పిలిచి సత్వరం పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశిం చారు. ఆ మేరకు పనులు ప్రారంబించారు. మండలంలోని సగం గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాలని దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి ఈ నీటి పథకాన్ని మంజూరు చేశారు. సదరు నీటి పథకం నేడు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. సమస్య విన్న వెంటనే నీటి పథకానికి మరమ్మతులు చేయించి ప్రజలకు నీరు అందేలా చేసేందుకు కృషి చేసిన ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డి, పులివెందుల ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డికి చక్రాయపేట మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. దసరా పండుగ సందర్భంగా ప్రజలకు నీటిని సరఫరా చేయడం ఆనందదాయకం.. అభినందనీయం.

ప్రకృతి వ్యవసాయం ద్వారా మంచి దిగుబడి

ప్రజాశక్తి - చక్రాయపేట

ప్రకృతి వ్యవ సాయం ద్వారా మంచి దిగుబడి వస్తుందని అధికారి ప్రతాప్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చిలేకంపల్లి, గంగారపు వాండ్ల పల్లిలో రైతుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో సంభోది బృందం నవీన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా..?

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఏదైనా ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా.. ముందుగా మేలుకోరా అని పలువురు విద్యుత్ శాఖ అధికారులను ప్రశ్నిస్తున్నారు. మండల పరిధిలోని గూడెంచెర్వు గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కంచె లేకుండా ప్రమాదకరంగా ఉంది. దాని పక్కనే నివాసాలు ఉన్నాయి. ఒక వైపు రోడ్డు, మరోవైపు ప్రజల ఇళ్లు ఉండడమే కాక నిత్యం వాహనాలు తిరుగుతున్న ప్రదేశం కావడంతో స్థానికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేస్తే ఎలాంటి ప్రమాదం జరగకుండా ఆపవచ్చని స్థానికులు సూచిస్తున్నారు. పశువులు వంటి మూగ జీవాలు అటువైపు వెళుతుంటాయని, అంతేకాక చిన్నపిల్లలు పొరపాటున అటు వెళితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని హడలిపోతున్నారు.ఇప్పటికైనా సంబంధించిన అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల పట్టణంలోని శిల్పారామంలో చిన్నారుల నత్యాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం సాయంత్రం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వల్లెపు వరప్రసాద్ దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేసి కారక్రమాన్ని ప్రారంభించారు.రాజ కళా నిలయం వారు నిర్వహించిన శిల్పారంలో చిన్నారులు చేసిన నత్యాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. దసరా పండుగ సెలవులు కావడంతో ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ , డ్యాన్స్ మాస్టర్ రాజ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న 'చల్లా' దంపతులు

- వివాహానికి రూ.50 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

నిరుపేద కుటుంబ వివాహానికి చల్లా రాజగోపాల్ యాదవ్ దంపతులు రూ.50 వేలు ఆర్థికసాయం చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రొద్దు టూరు కృష్ణాలయ కమిటీ చైర్మన్, కడప జిల్లా షూటింగ్ బాల్ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ నిరుపేదలైన సుకూర్, వహీదా కుమార్తె షాహీన్ వివాహానికి రూ.50 వేల ఆర్థికసాయం చేసి మరోమారు దాతృత్వం చాటుకున్నారు. ఎంతోమంది విద్యార్థులకు, ప్రతినిత్యం అన్నదానం, పలు వివాహాలకు అన్నదానం, ఆర్థిక సాయం చేస్తూ వస్తున్నారు. షాహీన్ వివాహ సమయానికి ఒక జత కమ్మలు అమ్మాయికి అందజేస్తామన్నారు. పలుపువు చల్లా దంపతులను అభినందించారు.

డాక్టర్ సుధాకర్‌ను సన్మానిస్తున్న గంటా నరహరి

టిడిపి నేతలను పరామర్శించిన 'గంటా నరహరి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

టిడిపి రాజంపేట పార్లమెంటు అభ్యర్థి గంటా నరహరి ఆదివారం రాజంపేట నియోజకవర్గంలోని పలువురు టిడిపి నాయకులను కలిసి పరామర్శించారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, మల్లెల సుబ్బరాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లెల శ్రీవాణీలను కలిసి ఆరోగ్య పరిస్థితులు గురించి ఆరా తీశారు. తాళ్లపాక గ్రామంలోని టిడిపి సీనియర్ నాయకులు అంజన్‌రాజును కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం నూతన గృహప్రవేశం చేసిన టిడిపి నేత గుగ్గిళ్ళ హరిని పలకరించారు. గుగ్గిళ్ళ చంద్రమౌళి, మాజీ టిడిపి పట్టణ అధ్యక్షులు తరిగోపుల సంజీవరావు ను కలిసి మాటామంతి కలిపి పలు విషయాలు చర్చించారు. కార్యక్రమంలో టిడిపి గ్రామీణ మండలాధ్యక్షులు గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, జగన్, చంద్రబాబు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వైసిపి ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొ న్నారు. ఆదివారం రూరల్ పరిధిలోని శేగిరెడ్డి కాట్రెడ్డి కళ్యాణ మండపంలో సామాజిక సాధికారత బస్సు యాత్రకు సంబంధించి కార్యకర్తలు, ప్రజా ప్రతి నిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ గత ప్రభుత్వాల హయాంలో రాష్ట్రంలో సామాజిక సాధికారత పేర్లకే పరిమి తమైం దని, జగన్ సీఎం అయ్యాకే ఆచరణలోకి వచ్చిందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలను రాజ్యాధికారంలో భాగస్వామ్యాలను చేశారని వివరించారు. ఈ యాత్ర రైల్వేస్టేషన్ రోడ్డులోని వైవి రామ్‌మోహన్‌రెడ్డి ఫంక్షన్ హాల్ నుండి ప్రారంభించి రామేశ్వరం రోడ్డు, వన్‌టౌన్ సర్కిల్, గాంధీరోడ్డు, విజయ్‌కుమార్ సర్కిల్, టిబి రోడ్డు, రాజీవ్ సర్కిల్, శివాలయం రోడ్డు మీదుగా శివాలయం సర్కిల్ వరకు నిర్వహించి అక్కడ సభ ఏర్పాటు చేశారు. ఎం పీపీ శేఖర్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ బీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ లు రంగారెడ్డి, సిఎస్ ఖాజా మొయిద్దీన్, అప్కబ్ చైర్మన్ మల్లెల ఝూన్సీరాణి, వైసిపి మహిళా పట్టణ అధ్యక్షురాలు కోనేటి సునంద, పట్టణ అధ్యక్షులు కామి శెట్టిబాబు, సర్పంచులు, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

కర్ణాటక మద్యం సీజ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు వారి నుంచి రూ.4లక్షల విలువ చేసే మద్యంతో పాటు సుమోను స్వాధీనం చేసుకున్నట్లు మదనపల్లి ఎస్‌ఇబి సిఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశలో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని కురబలకోట మండలం, అంగళ్లు చేనేతనగర్‌లో డాబా నిర్వహిస్తున్న సూర్యచంద్రారెడ్డి, సూరి అనుచరుడు నరేష్, డ్రైవర్ బాలసూరిలను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరు కర్ణాటక రాష్ట్రంలో 20 కేసులు మద్యం ప్యాకెట్లు తక్కువ రేటుకు కొనుగోలు చేసి అక్రమంగా కురబలకోట మండలానికి తరలిస్తుండడంతో పక్కా సమాచారంతో దాడులు చేశామన్నారు. ఎస్‌ఐలు రాజశేఖర్, అంజాద్‌బాషా, సిబ్బందితో వెళ్లి మదనపల్లి కదిరి రోడ్డు లోని అమ్మ చెరువు మిట్టపై సినీ ఫక్కీలో వెంటాడి వారిని అదుపులోకి తీసుకున్నామని అన్నారు. పట్టుబ డిన నిందితులను మదనపల్లి ఎస్‌ఇబి పోలీస్‌స్టేషన్‌కు తరలించి, విచారణ అనంతరం వారిపై అక్రమ మద్యం తరలింపుపై కేసు నమోదు చేసి నిందితులను ముగ్గురిని అరెస్టు చేశామని చెప్పారు. దాబా సూరి గతంలోనూ పలుమార్లు అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడి అరెస్టు అయ్యాడని తెలిపారు. ఈదాడుల్లో ఎస్‌ఐలు హరికుమార్, త్రిపురేంద్రుడు, లవకుమార్, బాలకృష్ణ, రూప్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మృతి చెందిన సుబ్రమణ్యం

మండలంలోని జ్యోతి కాలనీ వద్ద ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో యామల సుబ్రమణ్యం అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మాక్స్ టెంపో వాహనం మరమ్మతు కారణంగా జ్యోతికాలనీకి వెళ్లేందుకు బైక్‌పై సుబ్రమణ్యం వెళుతుండగా ఉల్లిలోడు లారీ కడప నుంచి చెన్నైకి వెళుతూ మోటార్ బైక్‌ను ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుడు సీవరం వడ్డిపల్లె గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-పీలేరు

రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పాకాల-గుంతకల్లు రైల్వే మార్గంలోని రామిరెడ్డిగారిపల్లి సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం సాయంత్రం పులిచెర్ల మండలం ,రామిరెడ్డి గారిపల్లి సమీపంలో గుంతకల్లు-తిరుపతి ప్యాసింజర్ రైలు ఢీకొన్న పటణంలోనిఎస్‌కెడినగర్ కు చెందిన ఉప్పుతోళ్ల ఆనంద(55) అనే వ్యక్తి మృతి చెందాడని తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే రైల్వే ట్రాక్ పై నిలబడి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడన్న అనుమానాన్ని పాకాల రైల్వే పోలీసులు వ్యక్తం చేశారని చెప్పారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- భర్త మృతి, భార్యకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా,భార్యకు తీవ్రగాయాలైన సంఘటన బి.కొత్తకోట మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ముదివేడు మండలం, మట్లివారిపల్లి పంచాయతీ,ఎర్రమద్దువారి పల్లి నివాసముండే అన్నయ్య, మధులు జీవనోపాధి రీత్యా బి.కొత్తకోట నగర పంచాయతీ, ప్రభుత్వాసుపత్రి ఎదురుగా పానీపూరి బండి పెట్టుకొని జీవిస్తున్నారని చెప్పారు.వీరిరువురూ ద్విచక్ర వాహనంలో బి.కొత్తకోట నుండి సాయంత్రం ముదివేడులో బంధువుల వివాహానికి వెళ్తుండగా మార్గమధ్యంలో మొగసాలమర్రి సమీపంలో వారికి ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో అన్నయ్య ద్విచక్ర నుండి పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడని, అతని భార్య మధుకి తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.